





పాల్వంచలో ఈద్గా వద్ద ముస్లింల సామూహిక ప్రార్థనలు



కొత్తగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పరిమళించిన మత సామరస్యం

- భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు
- ఇరు జిల్లాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- బంధువులు, స్నేహితులతో ముస్లింల ప్రత్యేక విందులు
- గొల్లగూడెంలో పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎంపీ నామా, ఎమ్మెల్సీ మధు

ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం సాంస్కృతికం, ఏప్రిల్ 11: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం పెద్దలు రంజాన్ విశిష్టతను తెలియచేసి సందేశం ఇచ్చారు. క్రమశిక్షణ, సమానత్వం, సామరస్యం, ఐక్యతకు, సేవాభావానికి ప్రతీకగా రంజాన్ నిలుస్తుందన్నారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. తెల్లవారుజామునుంచే ఖమ్మం నగరంతోపాటు ఇతర ప్రాంతాల్లో రంజాన్ సందడి నెలకొంది. నగరంలోని ఖిల్లా, పలుప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గొల్లగూడెం, గాంధీచౌక్ ఈద్గాల్లో షామియానాలు ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ సందర్భంగా నగరంలో సౌభ్రాతృత్వం వెల్లివిరిసింది. మసీదుల ప్రాంతంలో ముస్లింలకు పలువురు హిందువులు పండుగ శుభాకాంక్షలు తెలిపి ఆలింగనం చేసుకొని అలయ్ బలయ్ తెలిపారు. పలువురు ముస్లింలు తమ స్నేహితులను ఇంటికి పిలిచి విందు ఏర్పాటుచేశారు. పలు ప్రాంతాల్లో సేమ్యా, ఖీర్ పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా ముస్లింల ఇళ్లు బంధువులతో సందడిగా మారాయి. గొల్లగూడెం రోడ్ ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొన్నారు. గాంధీ చౌక్ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన ప్రార్థనల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా నేతలు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

భద్రాద్రి జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెంలోని బోడగుట్ట, ప్రగతిమైదానం, రుద్రంపూర్, రామవరం ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మణుగూరులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, బీఆర్ఎస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ (చిన్ని) ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక: మంత్రి తుమ్మల

రంజాన్ సందర్భంగా ముస్లింలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని గొల్లగూడెం రోడ్‌లోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవే అత్యున్నతమైనదని చాటిచెప్పే రంజాన్ పండుగ లౌకిక వాదానికి, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. గంగ, జమున, తెహజీబ్‌కు తెలంగాణ రాష్ట్రం ప్రతీకగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సాదు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్ తదితరులు పాల్గొన్నారు.

'ఖమ్మం' అభ్యర్థిపై అదే సస్పెన్స్

- నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి
- అధిష్ఠానంతో చర్చల అనంతరం ఖరారు
- తెరపైకి మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు
- జిల్లా మంత్రుల్లో ఏకాభిప్రాయం లేకపోవడంతో తర్జనభర్జన



మండవ వెంకటేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిపై ఒకటి రెండు రోజుల్లో క్లారిటీ రానుంది. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూడు నియోజకవర్గాలపై కసరత్తుకు ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు. శుక్రవారం ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి ఎంపిక విషయంపై చర్చించబోతున్నారు. దాంతో ఖమ్మం అభ్యర్థి ఎవరన్నది మిస్టరీ వీడే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఖమ్మం కాంగ్రెస్ టికెట్‌పై ఉమ్మడి జిల్లా వాసులతోపాటు రాష్ట్రానికి చెందిన పలువురు ప్రముఖులు టికెట్ కోసం కుస్తీ పడుతున్న విషయం విదితమే. ముగ్గురు మంత్రులకు సంబంధించి బంధుగణం, వారి అనుచరగణం టికెట్ కోసం సై అంటే సై అన్నట్టుగా పైస్థాయిలో ఇప్పటివరకు ప్రయత్నాలు సాగించారు.

ఇక అభ్యర్థి ఎంపిక ఎవరన్నది అధిష్టానం తేల్చాల్సి ఉంది. హైదరాబాద్, ఢిల్లీ స్థాయిలో టికెట్లకోసం ఏఐసీసీ అధినేతలను, పీసీసీ నేతలను కలిశారు. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ, స్క్రీనింగ్ కమిటీ కూడా వడపోతలు పోసింది. ముగ్గురు మంత్రుల బంధుగణంలో టికెట్ ఎవరికివ్వాలనే దానిపై చర్చసాగింది. ఒకవేళ మంత్రుల బంధుగణానికి ఇవ్వనిపక్షంలో సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని టికెట్టు కేటాయింపు జరిగే అవకాశం ఉంది.

మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని ముందు నుంచి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు సాగించారు. మంత్రుల బంధువులకు టికెట్ ఇవ్వని పక్షంలో పొంగులేటి సమీప బంధువు రామసహాయం రఘురామిరెడ్డి పేరు ప్రచారంలోకి వచ్చింది. కాంగ్రెస్ టికెట్ ఆశాపరులుగా దరఖాస్తు చేసుకున్న వారిలో గ్రానైట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమకుమార్, కొత్తగూడేనికి చెందిన నాగసీతారాములు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి మాజీ మార్కెట్ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ పేరు సూచించారు.

ఇదిలా ఉండగా మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు పేరు కూడా తెరపైకి రావడంతో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ అనేక మలుపులు తిరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి మనసులో ఎవరున్నారన్నది చెప్పలేని పరిస్థితి. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఐక్యంగా ఎవరి పేరు సూచించకపోవడం, అలాగే జిల్లా నుంచి ఆశాపరుల పేర్లపై కూడా ఏకాభిప్రాయం రాకపోవడంతో పూర్తిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం కీలకమయ్యే అవకాశం కనిపిస్తోంది. దీంతో చివరి ప్రయత్నంగా మళ్లీ ఆశాపరులు టికెట్ సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ఫైనల్ పోరులో ఎవరికి దక్కుతుందన్నది నేడో రేపో తేలబోతుంది.



జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నామా, పువ్వాడ, తాతా మధుసూదన్

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 11 : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నగరంలోని శ్రీశ్రీ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ లోక్‌సభాపక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పూలే సేవలను కొనియాడారు. బహుజనులు, వెనుకబడిన వర్గాల సమానత్వం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతికోసం పూలే తన జీవితాన్ని ధారపోసారన్నారు. మహిళలపై సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి, నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, మక్బూల్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు. నాయకులు గుండాల కృష్ణ, తాళ్లూరి జీవన్‌కుమార్, సుడా మాజీచైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం ఆర్టీసీ డిపోలో జ్యోతిరావు పూలే 198 జయంతి వేడుకలను నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం రీజనల్ మేనేజర్ వెంకన్న పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పూలే గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు.

సామాన్య ప్రజలు అనుమతులు తీసుకుని ఇంటి నిర్మాణం పూర్తి చేసిన తర్వాత, అనుమతులకు భిన్నంగా కొద్దిపాటి తేడా కనిపించిందంటే అధికారులు జరిమానాలు విధిస్తారు. ఇటీవల ఓ మాజీ పోలీస్ బాస్ అనుమతికి భిన్నంగా అదనంగా నిర్మాణం చేశారంటూ ఏకంగా కేసే నమోదు చేశారు. కానీ, కొందరు బిల్డర్లు ఇష్టారీతిన నిబంధనలు తుంగలో తొక్కి నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ ఆ వైపు అధికారులు కన్నెత్తి చూడటంలేదు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణాల్లో ఈ అతిక్రమణలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం తొలుత కొన్ని ఫ్లాట్లను మార్ట్‌గేజ్ చేస్తున్న బిల్డర్లు.. ఆ తర్వాత రిలీజ్ చేయించకుండానే అక్రమంగా విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన సామాన్యులు ఆ తర్వాత అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మార్ట్‌గేజ్, డీవియేషన్ల విషయంలో అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడంలో పెద్దఎత్తున ముడుపులు చేతులు మారుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)లో సాగుతున్న ఈ దందాకు బ్రేకులు వేవడం దుర్లభంగా కనిపిస్తోంది.



'మార్ట్‌గేజ్' మాయ

- అపార్ట్‌మెంట్ల నిర్మాణాల్లో బిల్డర్ల ఇష్టారాజ్యం
- 'మార్ట్‌గేజ్' ఫ్లాట్లు రిలీజ్ చేయకుండానే విక్రయాలు
- ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు తీసుకోకుండానే అమ్మకాలు
- ఖమ్మం నగరంలో పెద్దఎత్తున సాగుతున్న దందా
- నిర్మాణాలు పూర్తయ్యాక కన్నెత్తి చూడని అధికారులు
- కొన్న తర్వాత నానా ఇబ్బందులు పడుతున్న సామాన్యులు

ఖమ్మం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా సరే, ఏదైనా నిర్మాణం చేపట్టాలి అంటే దానికి సంబంధించి కార్పొరేషన్ కార్యాలయం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్లాన్ మంజూరు అయిన తర్వాతనే భవన నిర్మాణం చేయాల్సి ఉంటుంది. నిర్మాణ వైశాల్యం ప్రకారం అన్నీ కమర్షియల్ భవనాలకు, నివాసయోగ్యమైన భవనాలకు సంబంధించి 2 అంతస్థులు దాటినా, 200 చదరపు మీటర్లు దాటినా ఆయా భవన నిర్మాణాలకు తగ్గట్టుగా 10శాతం కార్పొరేషన్‌కు మార్ట్‌గేజ్ (తనఖా) రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అలా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత మాత్రమే బహుళ అంతస్థుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తారు. ఆ తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తీసుకుంటేనే సంబంధిత నిర్మాణ సమయంలో కార్పొరేషన్‌కు మార్టిగేజ్ చేసిన స్థలావైశాల్యాన్ని రిలీజ్ చేస్తారు.

ఒకవేళ ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తీసుకునే క్రమంలో అనుమతులు తీసుకున్నదాని ప్రకారం 10 శాతం తేడావస్తే అధికారులు దానిని పరిగణనలోకి తీసుకోరు. అంతకుమించి నిర్మాణంలో తేడా ఉంటే అన్ ఆథరైజ్డ్ పెనాల్టీ(యూఏపీ) కింద జరిమానా విధిస్తారు. ఆయా బిల్డర్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇచ్చేందుకు కార్పొరేషన్ అధికారులు తిరస్కరిస్తారు. దాంతో ఆయా బిల్డర్లు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు లేకుండానే అమ్మకాలు సాగిస్తున్నారు. సందట్లో సడేమియాగా నిర్మాణ సమయంలో కార్పొరేషన్ వారికి మార్టిగేజ్ చేసిన ప్లాట్లను సైతం విక్రయించి దర్జాగా రిజిస్ట్రేషన్లు చేయించడం గమనార్హం. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కొన్నాళ్లుగా ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

నగరంలోని గాంధీచౌక్‌లో ఓ పెద్ద అపార్ట్‌మెంటులో ఇదే తరహాలో కొన్ని ప్లాట్లను విక్రయించిన సంఘటన జరిగినట్టు వినికిడి. ముందుగా కార్పొరేషన్‌కు మార్టిగేజ్ చేసిన బిల్డర్లు, మార్టిగేజ్ రిలీజ్ చేయకుండానే ఆ ప్లాట్లను మరికొందరికి విక్రయించేశారు. దానిపై లోన్లను కూడా ఇప్పించారు. ఆ తర్వాత ఆ ప్లాట్లను కొనుగోలు చేసిన వారిలో ఒకరు తన ప్లాటును వేరొకరికి విక్రయించిన సమయంలో న్యాయవాది అభిప్రాయం కోసం వెళ్లినప్పుడు విషయం వెలుగులోకి వచ్చింది. కార్పొరేషన్ కార్యాలయానికి మార్టిగేజ్ చేసి ఉన్న ప్లాట్లను కొనుగోలు చేశారు కాబట్టి లోను ఇవ్వడం కుదరదనీ, దాంతోపాటు అసలు మార్టిగేజ్‌లో ఉన్నవాటిని కొనుగోలు చేసినప్పటికీ అవి చెల్లవంటూ సమాధానమివ్వడంతో కొనుగోలుదారుడు కంగుతినాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత బిల్డర్‌ని నిలదీయడంతో కిందమీద పడి మార్టిగేజ్ రిలీజ్ చేయించినట్టు వినికిడి.

పెద్ద ఎత్తున సాగుతున్న దందా

ఖమ్మం నగరంలో బహుళ అంతస్థుల్లో ఈ తరహా దందా పెద్ద ఎత్తున సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు బిల్డర్లు ఇష్టారీతిన నిర్మాణాలు చేసి రూ. కోట్లలో అక్రమార్జన చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులు ఆ తర్వాత ఆయా నిర్మాణాలవైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే ఇలాంటి అక్రమాలు పరిపాటిగా మారయన్న విమర్శలున్నాయి. అసలు కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన నిర్మాణ అనుమతుల లెక్కకు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తీసుకున్న వారి లెక్కకు, మార్టిగేజ్ నుంచి రిలీజ్ చేయించుకున్న లెక్కలకు పొంతన లేదన్న వాదన లేకపోలేదు.

వందల సంఖ్యలో బహుళ అంతస్థుల నిర్మాణాలకు అనుమతులు ఇస్తే, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు మాత్రం పదుల సంఖ్యలో మంజూరు చేస్తున్నట్టు వినికిడి. అంతేకాదు కార్పొరేషన్ కార్యాలయంలోని విభాగాల మధ్య సమన్వయం లోపిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగానే కేవలం నిర్మాణ అనుమతులు ఉంటే చాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెటు లేనప్పటికీ, మార్ట్‌గేజ్‌లో ఉన్న వాటికి సైతం ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.



7

అటవీ గ్రామాలకు మోక్షం

మంత్రి తుమ్మల కృషితో అటవీ శాఖ క్లియరెన్స్‌లు



7

కుక్కలకు సంరక్షణ కేంద్రం

ఖమ్మం నగరంలోని రోటరీ నగర్‌లో ఏర్పాటు



భద్రాద్రి వారధి వద్ద స్వాగత ద్వారం

ముస్తాబవుతున్న భద్రాద్రి

- ఐదు రోజుల్లో సీతారాముల కల్యాణం
- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎస్?
- నవమి లడ్డూ తయారీ ప్రారంభం
- సీఎం సెక్టార్ టికెట్లపై స్పష్టత కరువు

భద్రాచలం, ఏప్రిల్ 11: ఎటు చూసినా స్వాగత ద్వారాలు.. చాందినీ వస్త్రాలంకణలు.. దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న రామాలయం పరిసరాలు.. ఇప్పటికే రామయ్య కల్యాణానికి అంకురార్పణ నిర్వహించగా నిత్యం తిరువీధి సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న మిథిలా స్టేడియంలోని శిల్పకళా శోభితమైన కల్యాణ మండపం వేదికగా శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 18న శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని నిర్వహించనున్నారు. దీంతో తమ ఆరాధ్యదైవమైన రామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా ఈసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి కల్యాణ సమయంలో అందజేయనున్నట్టు సమాచారం. అధికారికంగా ఇప్పటి వరకు ఇంకా ఖరారు కానప్పటికీ సీఎస్ తెచ్చే అవకాశాలే ఉన్నాయని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

లడ్డూ తయారీ ప్రారంభం

శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నవమికి భక్తులకు విక్రయించేందుకు లడ్డూ తయారీని గురువారం ప్రారంభించారు. నవమికి రెండున్నర లక్షల లడ్డూలను సిద్ధం చేయనున్నారు. లడ్డూ తయారీకి ప్రస్తుతం 20మంది అందుబాటులో ఉండగా ఏపీలోని విజయవాడ నుంచి 22మందిని లడ్డూ తయారీ కోసం ప్రత్యేకంగా రప్పించారు. డిమాండ్‌ను బట్టి లడ్డూ

మిగతా 6వ పేజీలో...

దేవుడి పాదాల చెంతనే..

వేపకుంట్ల రామాలయ పూజారి హఠాన్మరణం



చక్రవర్తిచార్యులు(ఫైల్)

రఘునాథపాలెం, ఏప్రిల్ 11: రామాలయంలో నిత్య పూజలు చేసే పూజారి దేవుడి పాదాల చెంతనే గుండెపోటుతో కన్నుమూశారు. ఈ సంఘటన రఘునాథపాలెం మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. మధిర ప్రాంతానికి చెందిన నల్లాని చక్రవర్తిచార్యులు (70) రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామానికి 20 ఏళ్ల క్రితం కుటుంబ సభ్యులతో వచ్చి రామాలయంలో పూజలు చేస్తూ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. పూజారి గుడిలోకి రాగానే మైక్‌లో దేవుడి పాటలు పెట్టటం ఆనవాయితీగా వస్తోంది. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం రామాలయానికి వెళ్లి సాయంకాలం పూజలు ప్రారంభించి, మైక్‌లో దేవుడి పాటలు పెట్టారు. అయితే రాత్రి 8.30గంటలు దాటినా దేవాలయంలోని మైక్ బంద్ కాకపోవటంతో సమీపంలోనే ఉన్న గ్రామస్థులు ఆలయానికి వెళ్లి చూశారు. పూజారి చక్రవర్తిచార్యులు దేవుడు పాదాల ముందు విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులకు గ్రామస్థులు సమాచారం అందించారు. కాగా చక్రవర్తిచార్యులకు గతంలో బైపాస్ సర్జరీ జరిగినట్టు గ్రామస్థులు తెలిపారు.

ముస్తాబవుతున్న భద్రాద్రి

(5వ పేజీ తరువాయి)

తయారీని మరింతగా పెంచే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా నవమినాడు రామయ్య కల్యాణం తిలకించిన అనంతరం తలంబ్రాలు భక్తులకు అందించేందుకు దేవస్థానం వర్గాలు చర్యలు చేపట్టారు. 25క్వింటాళ్ల తలంబ్రాలను ఇందుకోసం సిద్ధం చేస్తున్నారు. అలాగే తొలి విడతలో మూడు లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా తానీషా కల్యాణ మండపం పక్కన ఉన్న దేవస్థానం వసతి సముదాయం (సౌమిత్రి, శ్రీరామసదనం, మారుతి సదనం)లకు వెళ్లేందుకు అంతర్గత సీసీ రహదారులను వేశారు.


లడ్డూ తయారీ


ప్రవేశ మార్గం వద్ద స్వాగత ద్వారం

సీఎం సెక్టార్ టికెట్లు

ఈసారి నవమికి సీఎం సెక్టార్లో టికెట్ల విక్రయాలను చేపడతామని అధికార యంత్రాంగం ప్రకటించింది. వీవీఐపీ రూ.10వేలు, వీఐపీ రూ.5వేలు టికెట్ ధరగా నిర్ణయించినట్టు ఇప్పటికే ప్రకటించారు. అయితే జిల్లాలో ఓ కీలక అధికారి పర్యవేక్షణలో ఈ టికెట్లను ప్రముఖులకు విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వినికిడి. అయితే ఐదు రోజుల్లో నవమి కల్యాణం ఉన్న క్రమంలో ఈ టికెట్ల విక్రయాలపై స్పష్టత రాకపోవడంతో ఎప్పుడు కొనుగోలు చేయాలని ప్రముఖులు ఎదురుచూస్తున్నారు.

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం

- ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి వినోదరావు
- పార్టీలో చేరిన న్యాయవాది మనోహర్‌రావు

కొత్తగూడెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని పదేళ్ల పాలనలో అవినీతి లేని పాలన అందించిన ఘనత మోదీదేనని మరోసారి దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ.రంగాకిరణ్ అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లిలోని మధువన్ కన్వెన్షన్ హాలులో జరిగిన బీజేపీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రముఖ న్యాయవాది జీవీకే. మనోహర్‌రావు వందలాది మంది కార్యకర్తలతో బీజేపీలో చేరారు. ఆయనకు జిల్లా అధ్యక్షులు కేవీ. రంగాకిరణ్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఒకప్పుడు జిల్లాలో బీజేపీ క్రియాశీలక నేతగా ఉన్న జీవీకే. మనోహర్‌రావు తిరిగి మాతృపార్టీలోకి రావడం అభినందనీయమన్నారు. ఖమ్మం పార్లమెంట్ స్థానంలో బీజేపీ జెండా ఎగురడం ఖాయమని స్పష్టం చేశారు. మనోహర్‌రావు మాట్లాడుతూ తాను కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నానని, దేశాభివృద్ధికి మోదీ చేస్తున్న కృషికి ఆకర్షితుడై ఆ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే కాంక్షతో తిరిగి బీజేపీలో చేరానని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బీజేపీలో చేరిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ మనోహర్‌రెడ్డి, పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఎం ధర్మారావు, నాయకులు కే. శ్రీధర్ రెడ్డి, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నరేంద్రబాబు, జల్లారపు శ్రీనివాస్, రాయుడు నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మనోహర్‌రావుకు పార్టీకండువా కప్పుతున్న నాయకులు

భద్రాద్రిలో రూ.3 కోట్లతో విద్యుత్ ఆధునీకరణ పనులు

- రూ.1.20 కోట్లతో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అదనంగా ఏర్పాటు
- ఇకపై విద్యుత్ అంతరాయం ఉండదు
- ట్రాన్స్‌కో అధికారులు

భద్రాచలం, ఏప్రిల్ 11: భద్రాచలం పట్టణంలో ట్రాన్స్‌కో అధికారులు రూ.3 కోట్లతో విద్యుత్ ఆధునికీకరణ పనులు నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలం సబ్ స్టేషన్‌లో రూ.1.20 కోట్ల 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అదనంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దీని వలన ఈ వేసవి కాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తవంటున్నారు. అలాగే రూ.15 లక్షలతో 315 కిలోవాట్ల విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ రామాలయానికి సరఫరా చేసేందుకు కొత్తగా ఏర్పాటు చేశారు.


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పట్టణంలో కొంతకాలంగా ఎదురవుతున్న లోవోల్టేజీ సమస్య, ఇతరత్రా సాంకేతిక విద్యుత్ సమస్యలకు రూ.1.20 కోట్లతో పరిష్కార మార్గం చూపారు. ఈ విద్యుత్ లైన్లను ఆధునీకరించడంతో ఇటీవల గత కొంత కాలంగా ఎదురవుతున్న సమస్యలు తొలగనున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే కొర్రాజులగుట్ట, భద్రాచలం ఉప కేంద్రాల వద్ద సాంకేతికపరమైన సమస్యలను తొలగించేందుకు రూ.35 లక్షలతో పనులను చేపట్టారు. ఇదిలా ఉండగా రామాలయం చుట్టూ ఉన్న విద్యుత్ స్తంభాలు తీసేసి టవర్ల ఏర్పాటుకు టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులు త్వరలోనే చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్ తెలిపారు.

సీహెచ్‌సీలలో వైద్యుల కొరత

- ఖాళీల భర్తీలో అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు

సత్తుపల్లి, ఏప్రిల్ 11: వైద్య విధాన పరిషత్ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. పలు విభాగాలకు చెందిన వైద్యులు ఏరియా ఆసుపత్రులలో అందుబాటులో లేకపోవడంతో పలువురు ప్రయివేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని ఆసుపత్రులు 7ఉండగా వీటిలో మూడు సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి మండల కేంద్రాలలో ఉన్నాయి. కల్లూరులో గతంలో పీహెచ్‌సీగా ఉన్న ఆసుపత్రిని 50పడకల ఆసుపత్రిగా మార్చి వైద్య విధాన పరిషత్‌లోకి తెచ్చారు. నియోజకవర్గంలోని 3ఆసుపత్రులలో వైద్యుల కొరత ఉంది.



సత్తుపల్లిలోని ఏరియా వైద్యశాల

సత్తుపల్లిలో..

సత్తుపల్లి పట్టణంలో 50పడకలతో నడుస్తున్న సీహెచ్‌సీలో మొత్తం 16మంది డాక్టర్లు ఉండాల్సి ఉంది. దీనికి గానూ 10మంది మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు డాక్టర్లు సెలవులో ఉండగా 4పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంఎస్, జనరల్ మెడిసిన్ ఎండీ ఇద్దరు, ఇద్దరు గైనకాలజిస్టులు, ఒక డెంటిస్ట్, కంటి వైద్య నిపుణులు, ఆర్థోపెడిక్, చిన్న పిల్లల వైద్యుడు, మత్తు వైద్యుడు ఉన్నారు. ఆసుపత్రిలో ఈఎన్‌టీ, రేడియాలజిస్ట్, కంటి శస్త్ర చికిత్స వైద్యుడు, డెర్మటాలజిస్ట్, పాంథాలజిస్ట్ ఇక్కడ అవసరం ఉంది. స్పెషలిస్టులు అందుబాటులో లేకపోవడంతో పలువురు ప్రయివేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతిరోజూ 350మంది రోగులు అవుట్ పేషంట్లుగా వస్తున్నారు. ఆసుపత్రి మొత్తంమీద 49మంది టెక్నీషియన్లు ఆసుపత్రిలో ఉండాల్సి ఉండగా 12మంది అందుబాటులో ఉండగా 37పోస్టులు ఖాళీగా ఉన్నాయి. థియేటర్ అసిస్టెంట్లు ఇద్దరు, నర్సులు 30మందికి గానూ 25మంది ఉండగా 5పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వైద్యులు కోరుతున్నారు. వంద పడకల సామర్థ్యంతో సత్తుపల్లిలో ఆసుపత్రి భవనం మంజూరైంది. ఇక్కడ భవన నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చినా దానిని రోగులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

కల్లూరులో..

కల్లూరులో ఏడాదిన్నర క్రితం వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చారు. 50 పడకలతో ప్రారంభించిన ఆసుపత్రిలో 12మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఉండాల్సి ఉంది. కానీ ఇక్కడ ఒకే ఒక్క వైద్యుడు ఉన్నారు. ఆయన కూడా డిప్యూటేషన్‌పై వచ్చారు. మొత్తం పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళా డాక్టర్లు, గైనకాలజిస్టులు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్లూరులో 50పడకల ఆసుపత్రి భవనం నిర్మాణం పూర్తికాక పోవడంతో 50పడకలకు గానూ 7పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ ఆసుపత్రిలో వైద్య సేవలు నామమాత్రంగా అందుతున్నాయి.

పెనుబల్లి మండలంలో...

పెనుబల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 11మంది వైద్యులకు గానూ 2పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ చిన్న పిల్లల వైద్యుడు, ఈఎన్‌టీ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రి నూతన భవనం కోసం గత ప్రభుత్వం రూ.7.50కోట్లు మంజూరు చేయగా నిర్మాణం కొనసాగుతోంది. ప్రతిరోజూ 250మంది రోగులు అవుట్ పేషంట్లుగా వస్తున్నారు.

వైభవంగా ధ్వజారోహణం

ఎర్రుపాలెం ఏప్రిల్ 11: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం మూడోరోజుకు చేరాయి. తెల్లవారుజామునుంచే శ్రీవారికి సుప్రబాతసేవ, అర్చనలు, సహస్రనామ అర్చనలు నిర్వహించారు. సకల దేవతల ఆహ్వానముగా శ్రీవారి వాహనమైన గరుడ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా ధ్వజారోహణం నిర్వహించారు. గరుడస్వామికి నివేదించిన గరుడముద్దప్రసాదం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లో నిల్చున్నారు. సంతానం లేని దంపతులు గరుడముద్దను స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం గోశాలలో గోపూజ అనంతరం యాగశాలలో బలిహరణ నిర్వహించారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదములతో పాటు ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు. సాయంకాలవేళ మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలతో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారిని మయూర వాహనంపై గిరిప్రదక్షణగావించా రు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, వ్యవస్థాపక కుటుంబసభ్యులు ఉప్పల వెంకట జయదేవశర్మ, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు విజయదేవశర్మ, రాజీవ్‌శర్మ, వేదపండితులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

నర్సరీలు పరిశీలించిన డీఆర్డీవో సన్యాసయ్య

రఘునాథపాలెం, ఏప్రిల్ 11: మండలంలోని దారేడు, పడమటితండా గ్రామ పంచాయతీల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య గురువారం పర్యటించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి కూలీలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అలాగే నర్సరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏపీడీ శ్రీదేవి, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంపీవో శ్రీనివాసరావు, ఏపీఓ పద్మయ్యనాయుడు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి


మాట్లాడుతున్న మురళి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్ 11: పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి కోరారు. గురువారం ఖమ్మం నగరంలోని ఐఎంఎ హాల్‌లో ఖమ్మం జిల్లా పద్మశాలి రిటైర్డు ఉద్యోగుల ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మురళి మాట్లాడుతూ పద్మశాలీలకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పద్మశాలీలు చట్టసభల్లో మన ప్రాతినిధ్యం పెరగాలని అందుకు అందరం ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరారు. కమర్తపు మురళిని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాస్‌బాబు, గౌరవ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, సీతారామయ్య, కమర్తపు నాగేశ్వరావు, దుస్సా సత్యనారాయణ, పిల్లలమర్రి కొండలరావు, గుడ్ల వీరభద్రం పాల్గొన్నారు.

కోటమైసమ్మ తల్లి ఆలయంలో కొనసాగుతున్న పవిత్ర బ్రహ్మోత్సవాలు


అమ్మవారికి పూజలుచేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్

కారేపల్లి ఏప్రిల్ 11: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోటమైసమ్మతల్లి ఆలయంలో పవిత్రబ్రహ్మోత్సవాలు రెండోరోజు కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాబి రామారావు, విజయలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో కోటమైసమ్మతల్లికి ఘనంగా పూజాలు నిర్వహించారు. ఇల్లెందు పట్టాణానికి చెందిన పురుగుమందుల వ్యాపారులు అమ్మవారి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి కైలాష్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యి రాములునాయక్ బ్రహ్మోత్సల కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 11: రూరల్ మండలం గుదిమళ్ల గ్రామంలో గురువారం వడదెబ్బతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. గుదిమళ్లకి చెందిన చెరుకుపల్లి కన్నయ్య(70)గ్రామంలో వ్యవసాయకూలీ పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి మూడు రోజులుగా అనారోగ్యం పాలయ్యాడు. పరిస్థితి విషమించి గురువారం కన్నయ్య మృతి చెందాడు. కన్నయ్యకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

భర్తపై దాడి చేసిన భార్యపై కేసు నమోదు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 11: భర్తపై దాడి చేసిన భార్య, ఆమె తరుపు బంధువులపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దతండా గ్రామానికి చెందిన బానోత్ మోతీలాల్, సుజాత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం భార్యభర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సుజాత ఆమె కుటుంబ సభ్యులను పిలిపించి, సుజాత ఆమె తండ్రి ధరావత్ సూక్యా, సోదరుడు రమేష్ ముగ్గురు కలిసి మోతీలాల్‌పై కర్రతో దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో అతడు తన భార్య సుజాత, ఆమెతండ్రి, సోదరుడిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇరువురిపై కేసు నమోదు

నేలకొండపల్లి, ఏప్రిల్ 11: ఓ కేసు విషయమై నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు బంధువులతో కలిసి వచ్చి స్టేషన్‌లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మండల పరిధిలోని చెర్వుమాధారం గ్రామానికి చెందిన ఇరువురిపై గురువారం రాత్రి నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెర్వుమాధారానికి చెందిన షేక్.నజియా, షేక్.ఇమామ్ వారి బంధువులతో కలిసి స్టేషన్‌కు వచ్చారు. షేక్.అలీం, అతని అన్న హకీంలను ఇమామ్, నజియాలు తిడుతూ ఆయన్ని మీరు తన్నాలి లేదా మేం చంపుతాం అంటూ పెద్దపెద్దగా అరుస్తూ స్టేషన్‌లో వీరంగం వేశారు. అడ్డు వచ్చిన కానిస్టేబుల్స్‌ను నెట్టివేస్తూ విధులకు ఆటంకం కలిగించారు. దీంతో కానిస్టేబుల్స్ నాగరాజు, లక్ష్మి, హనుమంతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట నాగరాజు చెప్పారు.

మిర్చి రైతులకు 'రైతుబంధు' రుణమేది?

- వడ్డీ లేని రుణం కోసం అన్నదాతల ఎదురు చూపు
- కోల్ట్‌స్టోరేజీ బాండ్ తెస్తే ఇస్తామంటున్న మార్కెట్ అధికారులు
- రైతుబంధుపై తర్జన భర్జన పడుతున్నరైతులు

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 11: 'మూలిగే నక్క మీద తాటి కాయ పడ్డ' చందంగా ఉంది మిర్చి రైతుల పరిస్థితి. ఆరుగాలం అప్పులు చేసి కష్టించి పండించిన పంటను అమ్ముకుందామంటే మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కని పరిస్థితి. ఈ నేపథ్యంలో పంటను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేస్తే ఇంటి దగ్గర పంట సాగుకు అప్పు ఇచ్చినవారు, కూలీలు, ఇతరత్రా ఖర్చులు ఎదురు చూస్తున్నాయి. దీంతో మిర్చి రైతులు అప్పుల వలయంలో పడి ఏ దిక్కూ లేని వాడిలా దిగులు చెందుతున్నారు. ఈక్రమంలో కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకున్న పంటకు మార్కెటింగ్ శాఖ రైతుబంధు పేర ఇచ్చే వడ్డీ లేని రుణం కోసం ఎదురు చూస్తున్నారు.


మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి ఫైల్‌ఫోటో


కోల్డ్ స్టోరేజీల ముందు బారులు తీరిన వాహనాలు

కోల్ట్‌స్టోరేజీ బాండు

జిల్లాలోని మిర్చి రైతులను రైతుబంధు రుణాల ద్వారా ఆదుకుంటామని మార్కెట్ అధికారులు పేర్కొంటున్నారు. తమ పంట నిల్వ చేసిన కోల్డ్ స్టోరేజీ తాలూకా బాండుతో తమ కార్యాలయంలో సంప్రదించాలని చెబుతున్నారు. ఈ ఏడాది కూడా రైతులకు 180 రోజుల కాలపరిమితితో కూడిన రూ. 2 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని పేర్కొంటున్నారు.

రుణాల ఇస్తాం దరఖాస్తు చేసుకోండి: మార్కెట్ కార్యదర్శి



కోల్డ్ స్టోరేజీలలో మిర్చి పంట నిల్వ చేసుకున్న రైతులకు ఈఏడాది కూడా వడ్డీ లేని రైతుబంధు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము. రైతులు తమ కోల్డ్ స్టోరేజీ బాండ్లతో ధరఖాస్తు చేసుకోండి. మిర్చి రైతులను ఆదుకునేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు తీసుకుంటుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రుణాలు మంజూరు చేస్తాము.

కరోనా కాలంలో రూ. 5 కోట్ల రుణాలు

మార్కెట్‌లో మిర్చి ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు తమ మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. కాగా రైతుబంధు రుణాలపై క్లారిటీ లేక తర్జన బర్జన పడుతూ రుణం కోసం ఇప్పటి వరకు ఒక్క రైతు కూడా దరఖాస్తు చేసుకోకపోవడం విశేషం. రైతబంధు రుణాలపై మార్కెటింగ్ శాఖ తగిన ప్రచారం చేయకపోవడంతో పాటు, మార్కెట్ యార్డులలో కనీసం రైతుబంధుపై ప్రకటనలు చేయలేదని విమర్శలు ఉన్నాయి. దీంతో రైతులు అయోమయంలో ఉన్నారు. మార్కెటింగ్ శాఖ గత 2020-21 సీజన్‌లో సుమా రు 1000 మంది రైతులకు రూ. 5 కోట్లు రుణాలు అందచేసింది. పంట మొత్తాన్ని పట్టి కోల్డ్ స్టోరేజీల బాండ్లపై ఒక్కో రైతుకు 6 నెలల కాలపరిమితి కలిగిన వడ్డీ లేని రుణాలను మంజూరు చేసింది. ఒక్కో రైతుకు రూ. లక్ష నుంచి రూ. 2 లక్షలకు మించకుండా రుణాలు అం దించి మిర్చి రైతులను ఆదుకుంది. ఇదే తరహాలో ప్రస్తుతం రుణాలు ఇచ్చే ఆలోచనలో మార్కెటింగ్ శాఖ ఉంది. కానీఈ ఏడాది రైతుబంధు రుణాలపై తగిన రీతిలో ప్రచారం కల్పించకపోవడంతో రైతుబంధు రుణాలపై నీలినీడలు కమ్ముకున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- దాహార్తిని తీర్చేందుకు నీటి కుంటల ఏర్పాటు
- వేటగాళ్ల ఆచూకీ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు

ఏన్కూరు, ఏప్రిల్ 11: ఈ ఏడాది భూగర్భజలాలు అడుగంటాయి. చెరువులు, కుంటలు ఎండిపోయాయి. పశువులకు నీరు దొరకని పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అడవి జంతువులు దాహార్తిని తీర్చుకొనేందుకు గ్రామాల్లోకి వచ్చి వేటకు బలవుతున్నాయి. అడవి జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అడువల్లో ప్రత్యేకంగా బోర్లను ఏర్పాటు చేసి, విద్యుత్ సౌకర్యం కల్పించారు. తద్వారా బోర్లలో నీరటిని తోడి ట్రాక్టర్ల ద్వారా నీటి తొట్లను నీటి కుంటలను నింపి, వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్నారు. గత నెల మార్చి నుండి మే చివరకు వాహనాలను సిబ్బందిని సమకూర్చి జల సంరక్షణ చర్యలు అటవీశాఖ అధికారులు చేపడుతన్నారు. నీటి వనరులున్నప్రదేశంలో వేటగాళ్ల ఆచూకి కోసం ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వేటగాళ్లపై నిఘా పెట్టి క్షణాల్లో సమాచారం తెలుసుకుంటన్నారు. అటవీ సమీప గ్రామాల్లో ప్రజలను చైతన్య పరుస్తున్నారు. వన్యప్రాణుల ను వేటాడేవారి సమాచారం, అడవి జంతువులు సమాచారం గ్రామస్తుల ద్వారా తెలుసుకుంటున్నారు. తల్లాడ, కారేపల్లి రేంజ్ పరిధిలో నాచారం, మేడేపల్లి, బురదరాఘవాపురం, కేసుపల్లి తిమ్మారావుపేట, మూలపోచారం, రంగాపురం అడవులున్నాయి. వీటిలో చిరుతపులి, దుప్పులు, కణుజులు, ఎలుగుబంట్లు, ముళ్ల పందులు, అడవి పందులు, జింకలు, లేళ్లు ఉన్నాయి. తల్లాడ రేంజ్ ఎఫ్ఆర్వో అరవింద్‌కుమార్, డీఆర్వో శ్రీనివాస్, అటవీ ప్రాంతాల్లో నిత్యం పర్యటిస్తూ వన్యప్రాణి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.


కనకగిరి అడవుల్లో సీసీ కెమెరాకి చిక్కిన వన్యప్రాణి


నీటితొట్లను నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- తెలంగాణ రైతు సంఘం 89వ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 11: అన్నదాతల ఉద్యమాలకు దశాబ్దాల చరిత్ర ఉందని, భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) ఏర్పాటు జరిగి రైతు సమస్యలపై అనేక పోరాటాలు చేసి విజయం సాధించిందని, ఇప్పుడు తిరిగి రైతులకు కార్పొరేట్ తరహా ముప్పు పొంచి ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలో రైతు సంఘం 89వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించి పోతినేని సుదర్శన్ ఆవిర్భావ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో పోతినేని మాట్లాడుతూ పేద రైతులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం విముక్తి కోసం ఒక సంఘం కావాలని రైతు సంఘం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 450 రైతు సంఘాలను సమన్వయం చేసుకొని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. 3 నల్ల చట్టాలను అడ్డుకోవటంలో రైతు సంఘం ఘనమైన విజయం సాధించిందన్నారు. నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై విక్రమ్, మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, పొన్నెకంటి సంగయ్య, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, నందిపాటి మనోహర్, మెరుగు రమణ పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న పోతినేని

అటవీ గ్రామాలకు మోక్షం

» మంత్రి తుమ్మల కృషితో అటవీశాఖ క్లియరెన్స్ » బీటీరోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలు ప్రారంభం

ఇల్లెందు, ఏప్రిల్ 11: నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అటవీశాఖ అభ్యంతరాలు, నక్సలైట్ల బెదిరింపులు, దా డులతో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో మోక్షం లభించింది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పథకం(ఎల్‌డబ్ల్యూఈ)ద్వారా భద్రాద్రి జిల్లాలో ఆళ్ళపల్లి, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో రూ.377.5కోట్లు మంజూర



లెనిన్ కాలనీ-కందిపాడు మధ్య రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

య్యాయి. అయితే గత ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి పథకాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేయడం, అటవీశాఖ నుంచి క్లియరెన్స్‌లు సాధించకపోవడంతో ఆయా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ఆర్‌అండ్‌బీ మంత్రిగా పనిచేసిన అనుభవం, ఎల్‌డబ్ల్యూఈ నిధులపై సంపూర్ణ అవగాహన కలిగిన తుమ్మల నాగేశ్వరరావు మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఏజెన్సీ ప్రాంతాలకు వరంలా మారింది. ఏజెన్సీ ప్రాంతాల ప్రజాప్రతినిధులు అటవీప్రాంత గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో వెంటనే స్పందించిన ఆయన కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి అటవీశాఖ క్లియరెన్స్‌ల కోసం తీవ్రంగా చేసిన కృషి ఫలించింది.

భద్రాద్రి జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత మారుమూల గ్రామాలకు రహదారులు, బ్రిడ్జి నిర్మాణాలకు ఆమోదం లభించింది. గతంలో మారుమూల అటవీ గామాలకు మౌలిక సౌకర్యాలు అందించాలన్న మంత్రి పట్టుదలతోనే ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. చీకటి మండలంగా పేరుపొందిన గుండాల మండలంలో తుమ్మల చేసిన కృషి వల్ల రహదార్లు, ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమహాస్టళ్ల భవనాలు నిర్మాణమై నేడు అభివృద్ధిలో మైదాన ప్రాంత మండలాలకు దీటు గా రూపొందిందనడం అతిశయోక్తికాదు. ఇటీవల మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి అటవీశాఖ క్లియరెన్స్ ఇప్పించడం పట్ల ఏజెన్సీ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వంలో తమ గ్రామాలకు బీటీ రోడ్లు, హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణాలు ప్రారంభం కావడంతో ఇక వర్షాకాలంలో సైతం తాము ఎలాంటి భయం లేకుండా ప్రయాణాలు సాగించవచ్చని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్యావైద్య సౌకర్యాలకు నోచుకోకుండా, కనీస రహదారులు లేక ఇబ్బందులు పడ్డ అటవీ ప్రాంత గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన మంత్రి తుమ్మలకు ఏజెన్సీ గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తపల్లి-గద్దెమడుగు మధ్య నిర్మాణమవుతున్న బ్రిడ్జి

ప్రమాదవశాత్తూ నీట మునిగి రేషన్‌డీలర్ మృతి

ఇల్లెందురూరల్, ఏప్రిల్11: ప్రమాదవశాత్తు నీటి మునిగి రేషన్‌డీలర్ మృతి చెందిన సంఘటన ఇల్లెందు మండలం మామిడిగుండాల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిగుండాల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ ఏగ్రిపోతుల భిక్షపతి(32) రోజు లాగే మధ్యాహ్నం బావిలో ఈత కొట్టేందుకు 9ఏళ్ల వయస్సు గల తన చిన్న కుమారుడైన సాత్విక్‌ను వెంట తీసుకొని వెళ్లాడు. అతడికి ఈత సరిగ్గా రాకపోవడంతో నడుముకు ప్లాస్టిక్ డబ్బాలు కట్టుకొని బావిలో ఈత కొడుతుండగా, ఒక్కసారిగా డబ్బాలు ఊడిపోవడంతో బావిలో మునిగిపోయాడు. ఇది గమనించిన అతని కుమారుడు తన తండ్రి మునిగిన విషయం ఇంటికి వెళ్లి చెప్పడంతో గ్రామస్థులు, కుటంబ సభ్యులు బావిలో మృతదేహాన్ని వెతికి బయటకు తీశారు. రేషన్ డీలర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



భిక్షపతి మృతదేహం

చికిత్స పొందుతూ వ్యక్తి..

తల్లాడ, ఏప్రిల్ 11: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన యువకుడు గురువారం మృతి చెందాడు. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన గోపిశెట్టి దుర్గాప్రసాద్(30) ఈనెల 2న ఆంధ్రప్రదేశ్‌లోని కూనవరం మండలం రేపాక గ్రామం వద్ద అతివేగంగా వెళ్తున్న మినీ వ్యాన్ మేకలను తప్పించబోయి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం దుర్గాప్రసాద్ మృతి చెందాడు. దుర్గాప్రసాద్‌కు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రైలు కిందపడి యువకుడు...

మధిర, ఏప్రిల్ 4: మధిర-మోటమర్రి గ్రామాల మధ్య గురువారం ఉదయం గుర్తు తెలియని రైలు కింద పడి గుర్తు తెలియని 30 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. కిలోమీటరు 528/3-1 వద్ద గురువారం ఉదయం సమయంలో ఎగువ లైన్‌పై వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి యువకుడు మృతి చెందాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలుగాని లభించలేదు. ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు మధిర జీఆర్‌పీ అవుట్‌పోస్టు ఇన్‌చార్జి వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బూర్గంపాడు, ఏప్రిల్ 11: బూర్గంపాడు మండల పరిధిలోని పాత గొమ్మూరు వద్ద గోదావరిలో గుర్తు తెలియని మృతదేహన్ని స్థానికులు గురువారం గుర్తించారు. ఐటీసీ వేస్ట్ వాటర్‌లో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ధ్వంసం చేసిన... నలుగురు నిందితుల రిమాండ్

జూలూరుపాడు, ఏప్రిల్ 11: ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు డ్రైవర్, ప్రయాణీకుడిపై దాడికి పాల్పడిన సంఘటనలో నలుగురు నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జీవన్‌రాజు తెలిపారు. మండలంలోని మాచినేనిపేటతండాకు చెందిన భూక్యా వినోద్‌కుమార్, లకావత్ గణేష్, లకావత్ శశికుమార్, గుగులోత్ విజయ్‌కుమార్‌లు బుధవారం మాచినేనిపేటతండాలో ఆర్టీసీ బస్సులోకి అక్రమంగా ప్రవేశించి ఆర్టీసీ బస్సును ధ్వంసం చేసి సంస్థకు రూ.21వేలు నష్టం కలిగించారని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఈ సంఘటనలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కొత్తగూడెం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా నలుగురికి 14రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడిన, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య

● కత్తిపీటపై పడి మృతి చెందాడంటూ నమ్మబలికిన వైనం

● పోలీసుల విచారణలో నిజం ఒప్పుకోలు

ఖమ్మం క్రైం, ఏప్రిల్11: నగరంలోని చెరువుకట్టబజార్‌లో నివాసం ఉంటున్న వడ్లానపు రాములు(54) మృతిపై టూటౌన్ పోలీసులు అనుమానస్పద మృతిగా బుధవారం కేసు చేసిన విషయం విదితమే. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పెద్ద కూరగాయాల మార్కెట్ సమీపంలోని చెరువుకట్టబజార్‌లో తన భార్య సత్యావతి, చిన్న కుమారుడితో కలిసి రాములు నివాసం ఉంటూ సారథినగర్‌లోని ఓ వైన్ షాపు నందు పనిచేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడికి వివాహం జరగడంతో అతని భార్యతో కలిసి నగరంలోని వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు గంజాయి కేసులో కొద్దిరోజుల క్రితం అరెస్ట్ అయి జైలులో ఉన్నాడు. చిన్న కుమారుడిని జైలు నుంచి బెయిల్‌పై బయటకు తీసుకువచ్చేందుకు పది రోజులుగా షూరిటీ సంతకాల కోసం పలువురి వద్దకు తిరుగుతున్నాడు. అయినా ఎవ్వరు సంతాకాలు పెట్టకపోవడంతో మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. తరువాత భార్యతో ఘర్షణ జరగడంతో.. క్షణికావేశానికి గురైన ఆమె భర్తపై పక్కన ఉన్న కత్తిపీట తీసుకుని తలపై గట్టిగా కొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడి కిందపడిపోయాడు. అనంతరం తన పెద్ద కుమారుడు కాశయ్యకు ఆమె ఫోన్ చేసి కత్తిపీటతో తలకు కొట్టుకుని పడిపోయాడని చెప్పింది. వెంటనే కుమారుడు ఇంటికి రాగా తండ్రి రక్తపు మడుగులో ఉండడాన్ని గమనించి 108 సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

తనకు తానే కొట్టుకుని మృతి చెందాడని పలువురికి మృతుడి భార్య చెప్పడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం మృతుడి మేనల్లుడు అక్కిపల్లి కృష్ణ మృతిపై అనుమానం ఉన్నదని ఫిర్యాదు చేయడంతో, మృతుడి భార్యను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. తానే కర్ర అనుకుని కత్తిపీటతో కొట్టగా మృతి చెందినట్టు తెలిపింది. దీంతో ఆమెను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

పండితాపురం ఘర్షణ ఘటనలో 10మంది రిమాండ్

కామేపల్లి, ఏప్రిల్ 11: కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో ఉగాది పర్వదినాన జరిగిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఇరువర్గాల ఘర్షణ ఘటనలో 28మందిపై పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం విదితమే. వారిలో 10మందిని అరెస్ట్ చేసి, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయమూర్తి ముందు హాజరు పరిచినట్లు సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు. కాగా వారికి న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

శ్రీరామ నవమికి ఆన్‌లైన్‌లో గదుల బుకింగ్ సౌకర్యం

● భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్11: భద్రాచలంలో ఈనెల 17,18 తేదీల్లో జరగనున్న శ్రీరామనవమి, మహాపట్టాభిషేక మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని, వారి సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో గదుల బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుక్కలకు సంరక్షణ కేంద్రం

» నగరంలోని రోటరీనగర్‌లో ఏర్పాటు » ఇప్పటి వరకు 5వేల కుక్కల సంరక్షణ



నగరంలోని రోటరీనగర్‌లో ఏర్పాటు చేసిన కుక్కల సంరక్షణ కేంద్రం

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్11: నగరంలో కుక్కల బెడదను అరికట్టేందుకు, వాటి సంతతి పెరగకుండా ఉండేందుకు శస్త్రచికిత్సలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆపరేషన్ల అనంతరం వాటిని సంరక్షించేందుకు నగరంలోని రోటరీనగర్‌లో కుక్కల సంరక్షణ కేంద్రాన్ని 2019లో నగరంలోని పాత ఎంపీడీవో కార్యాలయంలో సుమారు రూ.10లక్షల వ్యయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు అంటే ఐదేళ్ల కాలంలో సుమారు 5వేల కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసి ఈ సంరక్షణ కేంద్రంలో ఉంచారు.

కుక్కల సంరక్షణ ఏజెన్సీకి అప్పగింత

కుక్కలను పట్టడం, వాటికి శస్త్రచికిత్సలు నిర్వహించటం, అనంతరం సంరక్షణకేంద్రంలో ఉంచి, తిరిగి వదిలేయటం తదితర పనులు నిర్వహణను యానిమల్ వెల్ఫేర్ సొసైటీ అనే ఏజెన్సీకి అప్పగించారు. టెండర్ల ద్వారా గతంలో నిర్వహణను అప్పగించారు. కుక్కల సంరక్షణకు ఏడాదికి నగరపాలకసంస్థ సుమారు రూ.13లక్షలు కేటాయించింది. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటంతో నామినేటెడ్ కింద రూ.5లక్షలు కేటాయించారు. నిర్వహణ చేసే ఏజెన్సీ కుక్కలను పట్టుకునే సిబ్బందిని, శస్త్రచికిత్సలు చేసే వైద్యులను కాంట్రాక్టు పద్ధతిన తీసుకొని, వారికి రుసుమును చెల్లిస్తుంటారు. కాగా ఆపరేషన్ అనంతరం వారం నుంచి 10రోజుల వరకు కుక్కలను సంరక్షణ కేంద్రంలో ఉంచి, వాటికి ఆహారం, మంచినీరు అందజేస్తున్నారు.

గత ఏజెన్సీ హయాంలో అక్రమాలు

కుక్కల సంరక్షణ కేంద్రం నిర్వహణను పొందిన గత ఏజెన్సీ అక్రమాలకు పాల్పడటంతో సదరు ఏజెన్సీని తొలగించారు. కుక్కలకు చేసిన శస్త్ర చికిత్సల సంఖ్యను ఎక్కువగా చూపించి, అక్రమంగా సొమ్ములను వసూలు చేశారు. నిర్వహణపై కూడా పలు ఆరోపణలు రావడంతో అప్పటి ఏజెన్సీని తొలగించారు. తరువాత కొన్ని రోజులు కేంద్రం నిర్వహణ ఆగిపోయింది. ప్రస్తుతం నగరపాలకసంస్థ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

● నగరపాలకసంస్థ ఏఈ కుమార్

కుక్కల సంరక్షణ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. కేంద్రంలో కుక్కలకు నీరు, ఆహారం తదితర ఏర్పాట్లను తరచూ తనిఖీ చేస్తున్నామన్నారు. గతంలో వలె అక్రమాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం.

మతోన్మాద శక్తులను అడ్డుకోవడమే కామ్రేడ్ జార్జిరెడ్డికి అర్పించే నివాళులు

● పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 11: దేశంలో పెరుగుతున్న మతోన్మాద శక్తులను అడ్డుకోవడమే కామ్రేడ్ జార్జిరెడ్డికి ఇచ్చే ఘనమైన నివాళులని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ పిలుపునిచ్చారు. గురువారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 14న జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేష్, దీపిక, కిరణ్, సతీష్, వినయ్, చంద్రశేఖర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

రైతులకు తప్పిన గడ్డి కష్టాలు

» మిషన్‌తో కట్టలు కట్టిస్తున్న అన్నదాతలు

» కట్ట గడ్డికి రూ.35 చెల్లింపు

కరకగూడెం, ఏప్రిల్ 11: పశు గ్రాసం కోసం రైతులు పడరాని పాట్లు పడేవారు. కానీ ఇప్పుడు రైతులు కోత మిషన్ల ద్వారా కోసిన గడ్డిని కట్టే మిషన్లు రావడంతో రైతులకు గ్రాసం కోసం ఇబ్బందులు తప్పుతున్నాయి. గతంలో కోత మిషన్లు రాని సమయంలో కూలీల ద్వారా కోతలు కోసి కుప్పలు వేసేవారు. తరువాత పడుగులు పెట్టి ట్రాక్టర్ ద్వారా పడుగులు తొక్కించి కూలీలతో గడ్డి కట్టలు కట్టించి రైతులు తమ ఇంటి పెరట్లో గడ్డి వాములుగా ఏర్పాటు చేసుకుని పశువులకు మేత వేసేవారు. రోజులు మారడంతో చైన్ మిషన్లు, కోత మిషన్లు రావడంతో పశువులకు గ్రాసం లేక అనే ఇబ్బందులు పడుతూ బక్కి చిక్కడంతో రైతులు పశువుల బేరగాళ్లకు విక్రయిస్తున్నారు. అంతేకాక ఎరగడి మంటలు పడి గ్రాసం పూర్తిగా కాలి బూడిదగా మారుతుంది. ఇప్పుడు రైతులు మిషన్‌తో కోసిన వరి గడ్డిని గడ్డి కట్టలు కట్టేందుకు మిషన్లు రావడంతో రైతులు మిషన్‌తో గడ్డి కట్టలు కట్టిస్తున్నారు. మిషన్‌తో గడ్డి కట్టినందుకు రూ.35 చెల్లిస్తున్నారు. ఇప్పుడు గ్రాసం కొరత లేకుండా పోతుండటంతో ఇబ్బందులు లేకుండా పోతుందని రైతులు తెలుపుతున్నారు.



గడ్డిని కట్టలు కడుతున్న బేలర్

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

బోనకల్, ఏప్రిల్11: మండలంలోని నారాయణపురం గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన మురుకుట్ల సైదులు దుక్కిటెద్దులు రోజు వారీగా పొలానికి మేతకు వెళ్లాయి. విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ వద్ద పచ్చిక ఉండటంతో మేసేందుకు అటువైపునకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురై ఒక ఎద్దు అక్కడిక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌పార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడంతో పాటు తక్కువ ఎత్తులో ఉండటంతో షార్ట్ సర్క్యూట్‌తో ఒక ఎద్దు మృతి చెందిందని బాధిత రైతు వాపోయాడు. రూ.లక్ష రూపాయల విలువ చేసే ఎద్దు మృతి చెందిందని తెలిపాడు.

ట్రాఫిక్ పోస్టును ఢీకొన్న లారీ

● తప్పిన ప్రమాదం

భద్రాచలం, ఏప్రిల్ 11: భద్రాచలంలోని మార్కెట్ సెంటర్‌లో ఉన్న ట్రాఫిక్ పోస్టును గురువారం ఓ లారీ ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా ఆ పోస్టు నేలకొరిగింది. ఈ సమయంలో ట్రాఫిక్ పోస్టులో విధి నిర్వహణ పోలీసు సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల కాలంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అక్కడ ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అదృష్టవశాత్తు భోజన విరామ సమయం కావడంతో అదే సమయంలో ట్రాఫిక్ పోస్టులో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవరు పరారైనట్లు తెలిసింది.

ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

కరకగూడెం, ఏప్రిల్ 11: ఎదురెదురుగా ద్వి చక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బంగారుగూడెం వద్ద జరిగింది. తోగ్గు డెం గ్రామానికి చెందిన పూనెం వెంకటేష్ కరకగూడెం వైపు నుంచి వెళ్తుండగా, మణుగూరు నుంచి కరకగూడెం వస్తున్న ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

క్షతగాత్రుడిని గ్రామస్థులు వెంటనే 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గ్రామాల్లో తాగునీటి కష్టాలు

» మధిర నియోజకవర్గంలో జనం వెతలు

» అడుగంటిన బోర్లు, బావులు

» ఇబ్బందులు తొలగించాలని వినతి

మధిర, ఏప్రిల్ 11: మధిర నియోజకవర్గంలో భూగర్భజలాలు పడిపోయాయి. చెరువులు నీరులేక ఎండిపోతున్నాయి. మిషన్ భగీరథ తాగునీరు మూడురోజుల కొకసారి సరఫరా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో తాగునీరు రాక వ్యవసాయ బావుల నుంచి తెచ్చుకొంటున్న పరిస్థితి ఉంది. ప్రస్తుతం బావుల్లో నీరు అడుగంటిపోవడంతో ఎండలు మరింత ముదిరితే తాగునీటి కష్టాలు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువులను సాగర్‌నీటితో నింపితేనే ఈ విపత్తు నుంచి బైటపడగలమని స్థానిక పాలకులు తెలుపుతున్నారు. మధిర మండలంలో మిషన్ భగీరథ నీరు రెగ్యులర్‌గా రాకపోవడంతో స్థానిక మంచినీటి పథకాలద్వారానే తాగునీరు అరకొరగా సరఫరా అవుతుంది. వైరానదిలో నీరులేక మంచినీటి పథకాల బోర్లు అడుగంటిపోవడంతో అరకొరనీరే వస్తుంది. ఖమ్మంపాడులో త్రాగునీరు సమృద్ధిగా రావడంలేదని ప్రజలు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో రెండు మూడు రోజులకొకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ముదిగొండ మండలంలో చెరువులు, కుంటలు అడుగంటాయి. తాగునీరు, సాగునీరుకోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం తీసిన బావుల్లో నీరు ఇంకిపోవడంతో రైతుల వ్యవసాయ బావుల నుంచి మంచినీరు తెచ్చుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. చెరువులు నీరులేక ఎండిపోవడంతో పశువులకు నీటి కొరత ఏర్పడింది. ముదిగొండ మండలం గోకినపల్లిలో తాగునీరు బావిలో నీరు అడుగంటడంతో ఓరైతు బావినుంచి పైపులద్వారా తాగునీరు ఇచ్చేందుకు గ్రామపంచాయతీవారు ప్రయత్నిస్తున్నారు. చింతకాని మండలంలోని 26గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు 24 గ్రామాలకు మూడురోజులకొకసారి ఇస్తున్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా కోసం స్థానిక బోర్లు బావుల ద్వారానే సరఫరా కొనసాగుతుంది. అదికూడా రెండు రోజులకొకసారి ఇస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నీరు లేక అడుగంటిన మధిర మండలం మాటూరు పెద్ద చెరువు



గోకినపల్లి గ్రామంలో బావిలో అడుగంటిన నీరు

వెంచర్లకు ఉదయ్‌నగర్ గుట్ట మట్టి తరలింపు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 11: ఎన్నికల వేళ అధికారులు రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు ఎన్నికల ఏ ర్పాట్లు పనులో ఉంటారని భావించిన అక్రమ మట్టి వ్యాపారులు గురువారం నుంచి తిరిగి మట్టి తొలకాలను ప్రారం భించారు. పువ్వాడ ఉదయ్‌నగర్ మట్టి గుట్టల నుంచి రఘునాథపాలెం కూడలీలోని యాపిల్ సెంటర్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన రియల్ వెంచర్లకు మట్టి తొలకాలను ప్రారంభించారు. వెంచర్‌లో మట్టి గుట్టలు కనిపించకుండా ఎప్పటికప్పుడు చదును చేస్తూ లారీల ద్వారా మట్టి తొలకాలు నిర్వహిస్తున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న మట్టి తోలకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వెంచర్లకు తొలిన పువ్వాడ ఉదయ్‌నగర్ గుట్ట మట్టి

ప్రోత్సాహక బహుమతి ఏదీ..?

» మణుగూరులో లక్ష్యాన్ని సాధించినా కానరాని సంబురం

» ఆగ్రహిస్తున్న కార్మికులు, కార్మిక నాయకులు



మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం

మణుగూరుటౌన్, ఏప్రిల్ 11: మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 2023-24 సంవత్సర బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినా సంబురం కార్మికుల్లో నీరుగారుతోంది. లక్ష్యాన్ని సాధించామన్న సంతోషంలో ఉన్న కార్మికులకు యాజమాన్యం ఇప్పటివరకు ప్రోత్సాహక బహుమతి పంపిణీపై ఎటువంటి స్పష్టత లేకపోవడంతో ఏరియా కార్మికులు నిరుత్సాహనికి గురవుతున్నారు. గతంలో లక్ష్యాన్ని సాధించినందుకు యాజమాన్యం స్వీట్ ప్యాకెట్‌తో పాటు ఇన్సెంటీవ్, బహుమతిని కార్మికులందరికి అందించేది. క్రమ క్రమేనా లాభాల్లో వాటాను ఇస్తున్నమన్న నెపంతో ఇన్సెంటీవ్, బహుమతిని తొలగించి కేవలం స్వీట్ ప్యాకెట్‌కు మాత్రమే సింగరేణి యాజమాన్యం పరిమితం చేసింది. ఈ దఫా ఆ స్వీట్ ప్యాకెట్‌పై కూడా ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో కార్మికులతోపాటు కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యంపై ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పటికే వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో పనివేళలను మార్చాలని కోరుతున్న కార్మికులకు పని వేళల మార్పుపై, స్వీట్ ప్యాకెట్‌పై ఎటువంటి స్పందన యాజమాన్యం నుంచి లేకపోవడమే కార్మికుల ఆగ్రహానికి కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా యాజమాన్యం త్వరగా స్పందించి ప్రోత్సాహక బహుమతులపై ఓ నిర్ణయానికి వచ్చి ప్రకటించాలని కార్మికులు, కార్మిక నేతలు కోరుతున్నారు.

త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటాం

● రమేష్, డీజీఎం (పర్సనల్)



గత ఏడాది వార్షిక లక్ష్యాన్ని సాధించిన సంబురాల్లో భాగంగా కార్మికులకు ప్రోత్సాహక బహుమతి అందించేందుకు త్వరలోనే యాజమాన్య ఓ నిర్ణయం తీసుకుంటుంది. ఏరియాల వారీగా నిర్ణయం తీసుకోవాలా..? రీజియన్ వారీగా నిర్ణయం తీసుకోవాలా అన్న సందిగ్ధంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయా ఏరియా కార్మిక సంఘాల నాయకులు, కార్మికుల అభిప్రాయాల మేరకు నిర్ణయం తీసుకుని పంపిణీ తేదీని ప్రకటిస్తాం.

క్రైస్తవుల సమాధుల కూల్చివేత

● స్మశానవాటిక వద్ద ఉద్రిక్తత

ఇల్లందు టౌన్, ఏప్రిల్ 11: ఇల్లందు పట్టణంలోని బస్టాండ్ సమీపంలోగల స్మశాన వాటికలో క్రైస్తవులకు చెందిన సమాధులను కొందరు కుల్చివేయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. వివరాల ప్రకారం.. 629-1, 630 సర్వే నెంబర్లలో 1969 నుంచి సుమారు 9 ఎకరాల పట్టా భూమి తమకు ఉందంటూ ఇల్లెందుకు చెందిన ఎస్‌కే సలీమ్‌తో పాటు అతని వారసులు ఎక్స్‌కవేటర్ ద్వారా అక్కడ ఉన్న క్రైస్తవుల సమాధులను కూల్చివేయడాన్ని నాలుగు రోజులుగా చేపట్టారు. కాగా గురువారం పలువురు క్రైస్తవులు కూల్చివేతను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు అక్కడికి వెళ్లి ఎలాంటి భావోద్వేగాలకు గురి కాకుండా ఉండాలని, సమస్యను పరిష్కరిస్తామని ఇరువర్గాలకు హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కూనంనేని గెలుపుతో మొక్కుచెల్లించిన అభిమానులు

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 11: ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం ఎమ్మెల్యేగా పోటీలో నిలిచిన కూనంనేని విజయాన్ని కాంక్షిస్తూ మొక్కిన మొక్కును అభిమానులు ఆయన గెలుపుతో చెల్లించుకున్నారు. పట్టణ పరిధి రాహుల్‌గాంధీనగర్‌కు చెందిన పొందూరి నర్సింహారావు, మెల్‌టెక్ శ్రీను, కొర్రపాటి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల సాగర్, సూర్యదే వర వెంకటేశ్వరరావు తిరుపతిలో తలనీలాలు సమర్పించి స్వామివారిని దర్శించుకుని మొక్కును చెల్లించారు.



ఘనంగా రంజాన్ వేడుకలు

తెల్లవారుఝామునుంచే ఈద్గాల వద్ద ప్రార్థనలు

కుటుంబ సభ్యులు, స్నేహితులతో వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

రంజాన్ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారు ఝామునుంచే ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంబురాలు జరుపుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



'గూడెం'లో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని



ఇల్లెందు ఎమ్మెల్యే కోరం



మణుగూరులో ఎమ్మెల్యే పాయం



భద్రాచలం ఈద్గాలో..



దమ్మపేట ఈద్గాలో



రాంనగర్‌లో చిన్నారుల శుభాకాంక్షలు



పాల్వంచ దర్గాలో ప్రార్థనలు



అశ్వాపురం మండలం అమ్మగారిపల్లిలో..

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

కలెక్టర్ ప్రియాంక అల.. కేంద్రాల తనిఖీ



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 11: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణలో వేగం పెంచాలని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. గురువారం మండలంలోని గుంపెన, రాజాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 128 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంజూరు చేసి ప్రారంభించామన్నారు. ప్రతి కేంద్రంలో గన్నీ బ్యాగులు, తేమశాతం చేసే పరికరం, తూర్పారబట్టే యంత్రం, టార్పాలిన్‌లు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు తేమశాతం, తాల్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుంపెన, రాజాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తేమశాతాన్ని, తూకం వేసి పరిశీలించారు. ఏ రోజు తూకం వేసిన ధాన్యాన్ని ఆ రోజే రవాణా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కౌలు రైతుల జాబితా తయారు చేసి వారికి టోకెన్లు ఇవ్వాలన్నారు. కేంద్రాల్లో సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తీసుకువచ్చేలా ప్రోత్సహించాలని వ్యవసాయశాఖాధికారులకు ఆదేశించారు. అనంతరం రాజాపురం గ్రామంలో నీటి సరఫరా స్థితిగతులను పరిశీలించారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉండటం వలన తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, వ్యవసాయాధికారి బాబురావు, డీఎం సివిల్ సప్లై అధికారి తీనాథ్ బాబు, తహసీల్దార్ జగదీశ్వరప్రసాదు, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏడీఏ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, కార్యదర్శులు పాల్గొన్నారు.



నల్లాను పరిశీలిస్తున్న కలెక్టర్

శీతల పానీయాల పంపిణీ

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 11: పట్టణ శివారు ఇందిరాకాలనీ ఈద్గాలో రంజాన్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలకు ప్రార్థనల అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు ఆధ్వర్యంలో గురువారం శీతలపానీయాలను పంపిణీ చేశారు. శీతలపానియాల పంపిణీ చేపట్టిన నూకల రంగారావుతో పాటు పానియాల పంపిణీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖాజామియా, చాంద్‌పాషా, దస్తగిరి, అబ్దుల్లా, రఫీ, కొమ్మరాజు విజయ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, ఏప్రిల్ 11: సామాజిక విప్లవకారులు మహాత్మజ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంటరానితనాన్ని రూపుమాపడం కోసం కృషి చేసిన సంఘ సంస్కర్తని, మహిళ విద్యాభివృద్ధికి మార్గదర్శి నిత్యస్ఫూర్తి ప్రదాతని, సామాజిక అసమానతలు తొలగించిన కాంతిరేఖ అని అన్నారు. దీన జనుల జీవితాల్లో వెలుగు రేఖ మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో అలవాల రాజా పెరియార్, ముద్దా పిచ్చయ్య, గురజాల వెంకటేశ్వర్లు, అవులూరి సత్యనారాయణ, పేరాల నాగరాజు, కొమ్మగిరి వెంకటేశ్వర్లు, కోట ప్రభాకర్, వల్లెపోగు రాంబాబు, పసుపులేటి వెంకటేశ్వర్లు, గద్దల బాబురావు, గాడిద రాములు, మోదుగ ప్రకాష్ పాల్గొన్నారు. అలాగే మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు జ్యోతిరావుపూలే చిత్రపటంకు పూలమాల వేసి నివాళ్లర్పించారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: మహాత్మ జ్యోతిబాపు పూలే జయంతి వేడుకలను జూలూరుపాడులో గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు, సొసైటి చైర్మన్ లేళ్ళ వెంకటరెడ్డి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనరెడ్డి పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులకు మిఠాయిలను పంపిణీ చేశారు.

బూర్గంపాడులో..

బూర్గంపాడు: బూర్గంపాడులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మహనీయుల జయంతి మహోత్సవ కమిటి ఆధ్వర్యంలో గురువారం అసంఘటిత రంగ కార్మికులతో కలిసి మహాత్మ శ్రీ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమంలో..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: జ్యోతిబా పూలే జయంతి వేడుకలు కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, సింగరేణి ఏజీఎం శ్రీకాంత్, సామాజిక కార్యకర్త ప్రకృతి ప్రేమికులు గోరంట్ల సుగుణారావు, లగడపాటి రమేష్, మంజులా, కాకెల్లి సైమన్, సంజీవరావు, బంగారి శంకర్, కొండ జంపన్న, రాజేష్, అచ్చమ్మ, మల్లిఖార్జున్‌రావు, సత్యనారాయణ, రాజేశ్వరరావు, సింగర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురంలో...

అశ్వాపురం: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం హెవీవాటర్ ప్లాంట్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌతమీనగర్ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. జ్యోతిబా పూలే మహనీయుడని అన్నారు. ఆయన ఆశయాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పోగుల కొమరయ్య,ప్రదాన కార్యదర్శి పి.కేశవరావు, ఉద్యోగులు పెదిరెడ్ల శ్రీనివాస్, దేవరాజ్, బాడికర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత కార్మికులకు మెడికల్ కార్డులు

సింగరేణి డైరెక్టర్ (పా) శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ (పా) శ్రీనివాస్

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 11: ఉద్యోగ విరమణ చేసిన సింగరేణి కార్మికులకు సీపీఆర్‌ఎంఎస్ కార్డులను అందించి వైద్యసేవలు ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటామని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్‌వీకే. శ్రీనివాస్ తెలిపారు. విశ్రాంత కార్మికులకు సీపీఆర్‌ఎంఎస్ కార్డులను వెంటనే అందించి రూ.8లక్షల వైద్యసేవలను అందిస్తామని తెలిపారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైరైన కార్మికులు లైఫ్ సర్టిఫికెట్లను వెంటనే అందించి సీపీఆర్‌ఎంఎస్ కార్డులను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.సీతారామయ్య, రాజ్‌కుమార్, జీఎంలు బసవయ్య, కవితానాయుడు, రాంకుమార్‌రావు, సురేష్‌బాబు, సీఎంవో డాక్టర్ సుజాత, కంపెనీ కార్యదర్శి సునితా దేవి, అ ధికారులు శ్రీనివాసరావు, హరి ప్రసాద్, హరిశంకర్, రాజేశ్వరరావు, అజయ్‌కుమార్, కొమరయ్య, సుశీల్‌కుమార్, సునీలా, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత మారేడుబాక జట్టు

చర్ల, ఏప్రిల్ 11: చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామంలో గత వారం రోజుల పాటు చర్ల, వెంకటాపురం, దుమ్ముగూడెం మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దుమ్ముగూడెం మండలం మారేడు బాక, చర్ల మండలం కొయ్యూరు జట్లు తలపడ్డాయి. విజేతగా మారేడు బాక జట్టు నిలిచింది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బహుమతులను అందజేశారు.



నియోజకవర్గ వ్యాప్తంగా 'టీఎన్ఆర్' సేవలు

సేవలోనే ఆనందం ఉందంటున్న ట్రస్ట్ చైర్మన్

పాల్వంచ, ఏప్రిల్ 11: ములకలపల్లి మండలానికి చెందిన ఎన్ఆర్ఐ తాండ్ర వెంకటేశ్వరరావు ఏర్పాటు చేసిన టీఎన్ఆర్ ట్రస్ట్ కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా తన సేవలు విస్తృతపరచుకుంటుంది. ఈ నేపథ్యంలోనే రంజాన్ సందర్భంగా గురువారం పాల్వంచలోని ముస్లింలను ట్రస్ట్ సభ్యులు కలసి రంజాన్ శుభాకాంక్షలను తెలియజేశారు. గత రెండు రోజులుగా కొత్తగూడెం నియోజకవర్గం వ్యాప్తంగా టీఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, ములకలపల్లి మండలాల్లో ట్రస్ట్ సభ్యులు పర్యటించి ఆయా ప్రాంతాల్లోని పదిహేను వందల పేద ముస్లిం కుటుంబాలకు రూ.10లక్షల వ్యయంతో రంజాన్ పర్వదినం రోజున వంటకు వినియోగించే 11 రకాల వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉపవాస దీక్షలు కొనసాగించిన ముస్లిం సోదరులు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ తన వంతుగా వారికి ఈ విధంగా సహకరించానని, ఇది తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పేదవారికి సేవ చేయడంలోనే ఆనందం ఉందని అన్నారు. తన ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని, పేదలకు సేవ చేస్తానని ఆయన పేర్కొన్నారు.



రంజాన్ తోఫా అందజేస్తున్న ట్రస్ట్ సభ్యుడు

పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలి

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 11: దేశ వ్యాప్తంగా రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలని రైతుసంఘం (ఎఐకేఎస్) జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాధం పిలుపునిచ్చారు. గురువారం చండ్ర రాజేశ్వరరావు భవన్‌లో రైతు సంఘం (ఎఐకేఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1929లో బీహార్ రాష్ట్రంలో జమీందార్ దాడులకు వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం ఆ రాష్ట్ర రైతులంతా సంఘటితంగా పోరాడుతున్న క్రమంలో దేశ వ్యాప్తంగా ఉన్న రైతుల సమస్యలపై ఉద్యమాలు కొనసాగించడానికి 1936 ఏప్రిల్ 11న లక్నోనగరంలో అఖిల భారతకిసాన్ సభ పేరుతో రైతు సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. రైతుసంఘం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు దేశ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గిట్టుబాటు ధరల కోసం పంట నష్టపరిహారాల కోసం అనేక పోరాటాలు కొనసాగిస్తూ వస్తుందని కేంద్ర ప్ర భుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేపట్టిన పోరాటానికి నాయకత్వం వహించిన ఘనత ఎఐకేఎస్‌కు ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్రసమితి సభ్యులు కోటి నాగేశ్వరరావు, బీకేఎంయూ జిల్లా సహాయ కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఎఐటీయూసీ నాయకులు బండి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, కాంతయ్య, ముత్యాల కిరణ్‌కుమార్, సతీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 11: ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) అనుబంధ ప్రగతిశీల రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు సాయన్న డిమాండ్ చేశారు. చెరుపల్లి, మారాయిగూడెం, భీమవరం, రామచంద్రునిపేట గ్రామాల్లో చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరుల చేతిలో ఉన్న వ్యవసాయ భూములను స్థానిక ఆదివాసీలకు ఇప్పించాలని కోరారు.

లక్ష్మీనగరాన్ని సందర్శించిన దేవనాథ జీయర్‌స్వామి



వేదికపై మాట్లాడుతున్న దేవనాథ జీయర్ స్వామి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 11: లక్ష్మీనగరం దాసాంజనేయస్వామి ఆలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దేవనాథ జీయర్‌స్వామి గురువారం సందర్శించారు. అనంతరం వేదికపై ఆధ్యాత్మిక ప్రవచనాలను వెల్లడించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలనందజేశారు. అర్చకులు అరుట్ల రాజగోపాలాచార్యులు, టీటీడీ ధర్మాచార్య నాగేంద్రరెడ్డి, మఠం ఇంచార్జి గట్టు వెంకటాచార్య పాల్గొన్నారు.



పర్ణశాల రామాలయాన్ని దర్శించుకున్న భక్తులకు గురువారం ప్రత్యేక అధికారి అనీల్‌కుమార్ సీతారామచంద్రుల పాకెట్ సైజ్ చిత్ర పటాలను అందించారు.

-దుమ్ముగూడెం

యాదన్న చిరస్మరణీయుడు



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 11: ఇల్లెందు ప్రాంత విప్లవోద్యమంలో యాదన్న చిరస్మరణీయుడిగా నిలిచిపోతాడని, విప్లవోద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశాడని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐఎంఎల్ ప్రజాపంథా (మాస్‌లైన్) జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, చిన్న చంద్రన్న అన్నారు. గురువారం ఇల్లెందు మండలం సంజీవ్‌నగర్‌లో జరిగిన యాదన్న సంతాప సభలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇల్లెందు ప్రాంతంలో యాదన్న ప్రజలకు, పార్టీకి చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం యాదన్న చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సభలో జి.వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, నాయిని రాజు, ఈసం శంకర్, తుపాకుల నాగేశ్వరావు, రామ్‌సింగ్, ఎల్.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా గండి యాదన్న, ఎల్లన్నల జ్ఞాపకార్థం ఇల్లెందు మండలం మాణిక్యారంలో గ్రంథాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్, చంద్ర అరుణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో యాకుబ్‌షావలి, ఆవుల కిరణ్, శ్రీరాం కోటయ్య, బుర్ర వెంకన్న, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి రజత అభిషేక పాత్ర

ఈవోకు అందజేసిన హైదరాబాద్ వాసులు



వేదికపై మాట్లాడుతున్న దేవనాథ జీయర్ స్వామి

భద్రాచలం ఏప్రిల్ 11: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు రజత అభిషేక కావేరి పాత్రను హైదరాబాద్‌కు చెందిన కాకర్ల సుశురుత్, శోభారాణి దంపతులు అందజేశారు. గురువారం భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న వారు అనంతరం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి రజత అభిషేక పాత్రను లాంఛనంగా అందజేశారు. హైదరాబాదులో ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్స్‌గా ఉన్న వారు రామయ్యకు రజత అభిషేక పాత్రను అందజేయడం జరిగింది.

సింగరేణి ప్రధాన కార్యాలయంలో కానరాని సమయపాలన

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 11: సింగరేణి ప్రధాన కార్యాలయంతోపాటు పలు డిపార్టుమెంట్లలో అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తోన్నాయి. అధికారులు సకాలంలో విధులకు హాజరుకాకపోవడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చిన సింగరేణీయులు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంటుంది. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని పలు విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది ఇష్టం వచ్చిన సమయంలో వచ్చిపోతుండటం పట్ల పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే సింగరేణి యాజమాన్యం సింగరేణి ప్రధాన కార్యాలయంలో బయెమెట్రిక్ విధానం ఏర్పాటు చేయకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఉదయం 9గంటలకు విధులకు హాజరుకావాల్సిన సిబ్బంది ఉదయం 10, 11గంటలకు వస్తుండటం చర్చనీయాంశంగా మారుతోంది. 8గంటలు విధులు నిర్వర్తించాల్సిన సిబ్బంది పూర్తిస్థాయిలో పనులు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. సింగరేణి ప్రధాన కార్యాలయంలో పరిపాలన గాడి తప్పుతోందని, అధికారులు సైతం సిబ్బందిని మందలించే పరిస్థితి లేకుండాపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



సింగరేణి ప్రధాన కార్యాలయం